సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 7 । జనవరి । 2025



వివాదాలకు చిరునామా డీఈఓ

ఆమె లక్షలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు, జిల్లా మొత్తం విద్యాశాఖకే ఉన్నతాధికారి. అనతి కాలంలోనే.. వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. - 8లో



జిల్లాకే ప్రథమం.. అన్నమాచార్య విశ్వవిద్యాలయం

అన్నమయ్య జిల్లాలో అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. ఈ నెల 9న హర్యానా గవర్నర్ దీనిని ప్రారంభించనున్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

జిల్లాలో సోమవారం 15.5 - 29.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌కు కడప యువతి



సయ్యద్ సానియా

వైవీయూ : కడప నగరానికి చెందిన సయ్యద్ సానియాకు జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌లో సమన్వయం చేసే అరుదైన అవకాశం లభించింది. దేశరాజధాని న్యూఢిల్లీలో జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న 'నేషనల్ యూత్ ఫెస్టివల్-2025'లో నేషనల్ యంగ్ లీడర్‌షిప్ డైలాగ్ కార్యక్రమానికి యాంకర్‌గా వ్యవహరించనున్నారు. కడప నగరానికి చెందిన సయ్యద్ సానియా గతేడాది యూత్ పార్లమెంట్ ఫెస్టివల్-2024 కార్యక్రమంలో భాగంగా పార్లమెంట్‌లో ఉపన్యసించిన విషయం తెలిసిందే. ఇందులో పాల్గొన్న 32 మంది యువతను రెండు రౌండ్ల పోటీలు నిర్వహించి చివరగా యూత్ ఫెస్టివల్-2025 కార్యక్రమ నిర్వహణకు 10మంది యువతను ఎంపిక చేశారు. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక యువతి సానియానే కావడం విశేషం. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, యువజన, క్రీడలశాఖా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తదితర ప్రముఖులు పాల్గొనే కార్యక్రమానికి జిల్లాకు చెందిన యువతి సమన్వయం చేసే అవకాశం లభించడం అభినందనీయమని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి మణికంఠ పేర్కొన్నారు. కాగా ఈమె కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఈమె తల్లి సోఫియా గృహిణి కాగా, తండ్రి సయ్యద్ జాఫర్‌వలి సైకిల్ మార్ట్ నిర్వహిస్తున్నారు.

జిల్లా పశు వైద్యశాలలకు మందుల రాక

- జిల్లా పశు సంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ



జిల్లా కేంద్రానికి చేరిన మందులను పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధశాఖ జేడీ శారదమ్మ

కడప అగ్రికల్చర్ : జిల్లావ్యాప్తంగా మొదటి విడత కింద అన్ని పశువైద్యశాలలకు అవసరమైన మందులు మంజూరైనట్లు జిల్లా పశు సంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా రూ. కోటి 31 లక్షలకు మందులు సోమవారం కడపలోని జిల్లా పశు సంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి వచ్చాయని తెలిపారు. సంబంధిత మందులను ఆయా పశు వైద్యశాలకు పంపించామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు కల్చరల్ : కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసీ పుల్లయ్య జ్ఞాపకార్థం ప్రతిభగల పేద విద్యార్థులకు అందించే ఉపకార వేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరంలో 80 శాతంపైగా మార్కులు సాధించిన పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, పీజీ చదువుతున్న ప్రతిభ గల పేద విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హులని పేర్కొన్నారు. 500 మంది పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా ఉపకార వేతనాలను అందిస్తామని వివరించారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ లోపల దరఖాస్తులను పంపాలని సూచించారు. వెబ్‌సైట్ తదితర పూర్తి వివరాలకు 9949516637, 08564-253866 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పెద్దమ్మ జోలికి రావొద్దు బ్రదర్స్



పోట్లదుర్తి గ్రామంలో ఆలయం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ



ప్రహరీ నిర్మాణం కోసం సిద్ధం చేసిన రాళ్లు

సాక్షి ప్రతినిధి కడప : అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ స్వగ్రామమైన పోట్లదుర్తిలో ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలోని పెద్దమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో జిమ్, పార్క్, ప్రహరీల నిర్మాణాలకు సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు ప్రయత్నించగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ దేవాలయం ప్రాంగణంలోని ఆలయ భూమిలో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టొద్దని నినదించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. ముందుగానే ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐలు నరేష్‌బాబు, మహమ్మద్ రఫీ పర్యవేక్షణలో పోలీసు బలగాలు మోహరించాయి. జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ, దేవదాయ శాఖ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దార్ శోభన్‌బాబు పోట్లదుర్తికి చేరుకున్నారు.

అసలు వివాదం ఇదే..

పోట్లదుర్తిలోని పెద్దమ్మతల్లి ఆలయానికి సంబంధించి సుమారు 3.09 ఎకరాల భూమి ఉంది. ఇందులో చాలా వరకు ఆక్రమణకు గురైంది. తాజాగా ఈ ఆలయ ప్రాంగణంలో జిమ్,పార్కు, ప్రహరీ నిర్మాణాలు చేపట్టాలని 'బ్రదర్స్'పథక రచన చేశారు. ఇందుకోసం ఎంపీ రమేష్ ఎంపీ నిధుల కింద సుమారు రూ.90లక్షలు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పనులు ప్రారంభించడానికి సిద్ధమయ్యారు. దీంతో ఈ పనులు ఆపాలని గ్రామస్తులు పట్టుబట్టారు. ఏటా మే నెలలో జరిగే తిరుణాలకు వేలాదిమంది భక్తులు వస్తారని, ఆలయం ప్రాంగణంలో ఉన్న భూమిలో కట్టడాలు కడితే స్థలం కుదించుకుని పోయి భక్తులకు ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు వివరించారు. వెంటనే పనులు ఆపాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఇక్కడ పనులు జరుగుతున్నాయని .. జిమ్, పార్క్ లేకుండా కేవలం ప్రహరీ మాత్రమే కడతారని జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికారుల రాకతో సీఎం సురేష్‌నాయుడు వర్గీయులు వెనక్కు తగ్గారు.

ప్రహరీ పనులు నిలిపేయాలి



శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో సీఎం రమేష్ నిధులతో నిర్మిస్తున్న ప్రహరీ పనులు కూడా నిలుదల చేయాలి. ఆలయ భూమి అక్రమణకు గురైంది. ఈ భూమిలో ఎలాంటి పనులు చేయకుండా అలానే ఉంచాలి. ఆలయానికి చెందిన 3.09 ఎకరాలు భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలి
- నంద్యాల సోమశేఖర్‌రెడ్డి, పోట్లదుర్తి గ్రామం

ఆక్రమణదారులందరికీ నోటీసులు ఇవ్వాలి..



ఆలయానికి చెందిన సుమారు 3.09 ఎకరాల భూమిలో చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారు. అక్రమణ దారులందరికీ నోటీసులు ఇవ్వాలి. భూమిలో ఎలాంటి కట్టడాలు ప్రహరీ, జిమ్, పార్క్‌లు వద్దు. ఎలా ఉన్న భూమిని అలానే ఉంచాలి. ఈ భూమిలోని డ్రైనేజీలు కూడా కట్టారు. డ్రైనేజీ అవతల వరకు దేవాలయ భూమి ఉంది.
- పీ లక్ష్మిరెడ్డి, పోట్లదుర్తి గ్రామం

తొక్కిసలాట జరిగే అవకాశం



ఆలయానికి సుమారు 3.09 ఎకరాల భూమి ఉంది. ప్రతి ఏడాది జరిగే జాతరకు సుమారు 20 వేల మంది భక్తులు వస్తారు. ఆలయం భూమి అక్రమణకు గురై కుదించుకుని పోయింది. ఇంకా నిర్మాణాలు చేస్తే జాతరలో తొక్కిసలాట జరిగే అవకాశం ఉంది. ఎంపీ సీఎం రమేష్ నిధులు ప్రజలకు ఉపయోగపడే చోట వినియోగించండి. ఈ దేవాయాన్ని అప్పట్లో దాతలు సహకారంతో కట్టాం. ఇప్పుడు ఎలాంటి నిర్మాణ పనులు చేయొద్దు. -శివవర్ధన్‌రెడ్డి, పోట్లదుర్తి గ్రామం

దేవాలయ భూమిలో ఎలాంటి పనులు చేయొద్దు



శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో ఎలాంటి నిర్మాణ పనులు చేయద్దు. ఇప్పటికే చాలా మంది అక్రమించుకున్నారు. వారందరికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలి. దేవాలయ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలి. అధికారుల కూడా ప్రజల మనోభావాలు దెబ్బతీయకుండా ఆలయం భూమిని కాపాడాలి
- పీ శివారెడ్డి, పోట్లదుర్తి గ్రామం

కోడిపందేల నిర్వహణ నేరం

కడప సెవెన్‌రోడ్స్: సంక్రాంతి సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో రూపొందించిన పోస్టర్లను జేసీ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడి పందేలు నిర్వహించడం, పాల్గొనడం నేరమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలో 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని కలసపాడు మండలం పెండ్లిమర్రి, కాశినాయన మండలం అక్కెంగుండ్ల, పోరుమామిళ్ల మండలం రౌతుపల్లి, పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట మండలం మారెళ్లమడక, సింహాద్రిపురం మండలం దేవతపురం, పులివెందుల మండలం వెంకటాంపల్లెలో సదస్సులు జరగనున్నాయి. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని రాజుపాలెం మండలం పొట్టిపాడు, ప్రొద్దుటూరు మండలం ప్రొద్దుటూరు అర్బన్, మైలవరం మండలం వేపరాల, పెద్దముడియం మండలం కొండసుంకేసుల, కొండాపురం మండలం రేగడిపల్లి, జమ్మలమడుగు మండలం ధర్మాపురం, ముద్దనూరు మండలం కె.కొత్తపల్లి, దువ్వూరు మండలం గుడిపాడు, చాపాడు మండలం అనంతపురం, కడప రెవెన్యూ డివిజన్‌లోని పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె, చింతకొమ్మదిన్నె మండలం చెర్లోపల్లె, కమలాపురం మండలం సి. గోపులాపురం, చెన్నూరు మండలం రాచినాయనపల్లి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో వివరించారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

కడప సెవెన్‌రోడ్స్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 ప్రక్రియలో భాగంగా సోమవారం కలెక్టర్ జిల్లా ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు నమోదు అధికారి కార్యాలయాలు, సహాయ ఓటరు నమోదు అధికారి కార్యాలయాలు, పోలింగ్ కేంద్రాలలో ఈ జాబితాలను ప్రదర్శించారు. ఈ ఓటరు జాబితాలను పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
124 బద్వేలు (ఎస్సీ)	109492	110423	05	219920
126 కడప	138823	145562	89	284474
129 పులివెందుల	111854	118004	19	229877
130 కమలాపురం	100194	104586	34	204814
131 జమ్మలమడుగు	117705	124762	15	242482
132 ప్రొద్దుటూరు	120083	128060	49	248192
133 మైదుకూరు	104222	107879	04	212105
మొత్తం	802373	839276	215	1641864

టీడీపీలో టెండర్ సెగలు

- ఆధిపత్య పోరులో టెండర్ రద్దు
- అమ్మ చెబితే అధికారులు పాటించాల్సిందే



ఏపీఎండీసీ క్యాంటీన్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఏపీఎండీసీ క్యాంటీన్ నిర్వహణ కోసం ఇటీవల నిర్వహించిన టెండర్‌లో టీడీపీ నాయకులు నీకా..నాకా అంటూ పోటీ పడ్డారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానంద రెడ్డి క్యాంటీన్ టెండర్ తన వర్గం వారికి కావాలని మంగంపేట టీడీపీ నాయకులతో మంతనాలు జరిపారు. విఫలం కావడంతో రూపానందరెడ్డి వర్గంతోపాటు మంగంపేట టీడీపీ నాయకులు టెండర్‌లో పాల్గొని సొంతం చేసుకున్నారు. ఆమోదం కోసం ఏపీఎండీసీ అధికారులు విజయవాడ కేంద్ర కార్యాలయానికి పంపించారు. దీంతో టీడీపీ నాయకులు మధ్య సెగ రాజుకుంది.

టెండర్‌లో గోకుల్, శ్రీదేవి, ఫుడ్ మూడు కంపెనీలు మాత్రమే పాల్గొన్నాయి. అన్ని పత్రాలు సేకరించిన తరువాత నిబంధనల మేరకే ఏపీఎండీసీ కార్యాలయంలో క్యాంటీన్ నిర్వహణ కోసం అధికారులు టెండర్ నిర్వహించారు. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జి వర్గానికి రాకపోవడంతో ఆయన సతీమణి ఏకంగా అక్రమంగా టెండర్‌ను రద్దు చేయించారు. అధికారులు సైతం అమ్మ ఆదేశిస్తే కచ్చితంగా పాటిస్తున్నారు. నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి కుటుంబ పాలన అన్ని విషయాల్లో తారాస్థాయికి చేరడంతో ఆ పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. కొందరు నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సంవత్సరాలుగా టీడీపీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తలను అన్యాయంగా అణిచివేయడం జరుగుతోందని ఆ పార్టీ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు.

మరోసారి టెండర్ పిలుస్తాం

ఓబులవారిపల్లె : మంగంపేట ఏపీఎండీసీ క్యాంటీన్ నిర్వహణ కోసం మరోసారి టెండర్‌ను పిలవనున్నట్లు సీపీఓ సుదర్శన్ రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల జరిపిన టెండర్లకు సంబంధించి గోకుల్, శ్రీదేవి, ఫుడ్డీస్ మూడు కంపెనీలు పాల్గొన్నాయన్నారు. వారు ఇచ్చిన పత్రాల్లో లోటుపాట్లు ఉండటంతో విజయవాడ కార్యాలయం తిరిస్కరించిందన్నారు.ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు త్వరలో మరోసారి టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులకు సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. తొలుత జేసీ పిజిఆర్ఎస్ నోడ ల్ అధికారి, జెడ్పీ సీఈవో ఓబులమ్మ పిజిఆర్ఎస్ దర ఖాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు.

అర్జీలలో కొన్నింటి వివరాలు..

- తనకు, ఆయాగా పనిచేస్తున్న తన భార్య సరళకు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ అకారణంగా తొలగించిందని రాజుపాలెం మండలం అర్కటవేముల గ్రామానికి చెందిన వాచ్‌మెన్ పేరనందం బాబు ఫిర్యాదు చేశారు.
- తన ఎఫ్‌పి షాపును తనిఖీ చేసి 6ఏ కేసు నమోదు చేశారని.. తిరిగి చౌక దుకాణం ఇవ్వాలని చాపాడు మండలం చిన్న గురువలూరు గ్రామానికి చెందిన గుర్రయ్య కోరారు.
- గ్రామంలోని స్మశానవాటికకు ప్రజలు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే దారి కల్పించి సీసీ రోడ్డును పీఐయూ నిధుల నుంచి నిర్మాణం చేయాలని సిద్దవటం మండల ఖాజీపల్లి గ్రామానికి చెందిన దుంపల పవన్‌కుమార్ రెడ్డి విన్నవించారు.

406 మంది హాజరు



కానిస్టేబుల్ అభ్యర్థుల ఎత్తును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కడప అర్బన్: పోలీసు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కడప నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఆరో రోజు పరీక్షలను ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షించారు. 600 మంది అభ్యర్థులకుగాను 406 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 247 మంది అర్హత సాధించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీకోర్ టీమ్, డీపీఓ సిబ్బంది ఉన్నారు.

కదం తొక్కిన మహిళా లోకం!

కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్నమెప్మా ఆర్పీలు



చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఒకటో తేదీ జీతాలు చెల్లిస్తామన్న మాటను తుంగలో తొక్కుతోంది. 'నెలంతా కష్టపడి పని చేసేది.. ఆశగా ఎదురుచూసేది ఆ జీతం కోసమే... అలాంటి జీతం సమయానికి ఇవ్వకుంటే ఎంతకష్టం సారూ' అంటూ మెప్మా ఆర్పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నెలా..రెండునెలలు కాదు నాలుగు నెలల నుంచి జీతాలివ్వకుంటే బతికేదెట్టా బాబూ' అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మెప్మాలో పనిచేస్తున్న రీసోర్స్ పర్సన్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ కేసీ బాదుల్లా, మెప్మా ఆర్పీల అసోసియేషన్ నాయకులు విజయలక్ష్మి వీరికి మద్దతు తెలిపారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్పీలతో కలిసి జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రమిచ్చారు. - కడప సెవెన్ రోడ్స్

'దీక్ష' బూనిన కార్మిక వర్గం

కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు చేపట్టిన భవన నిర్మాణ కార్మికులు



'అధికారంలోకి రావడం ఆలస్యం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామంటూ ఎన్నికల ప్రచారంలో భవన నిర్మాణ కార్మికులకు కూటమి పెద్దలు హామీ ఇచ్చారు. ఒకటి రెండు కాదు అందలం ఎక్కి ఆర్నెళ్లు దాటిపోయింది. సంక్షేమం అటకెక్కింది.. ఇదేనా మీ పాలన' అంటూ భవన నిర్మాణ కార్మికులు తూర్పారబడుతున్నారు. కార్మికుల సంక్షేమం నిధులు వేరే వాటికి మళ్లించడం అన్యాయమంటూ మండిపడ్డారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన భవన నిర్మాణ కార్మికుల నిరాహార దీక్షలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కార్మిక సంక్షేమ మండలి బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల దీక్షకు సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర తదితరులు మద్దతు తెలిపారు. - కడప సెవెన్‌రోడ్స్

ఆకలివేటలో జీవనయానం



జానెడు పొట్ట నిండాలన్నా...
ఓ పూటకు పట్టెడన్నం కావాలన్నా...
భుజాన బండెడు బరువు మోయాల్సిందే...
బోలెడు కష్టాలు పంటిబిగువున
భరించాల్సిందే..
ఆరడుగుల మనిషికైనా..
నాలుగుకాళ్ల జంతువుకైనా...
ఆకలికేక ఒకటే..
ఇదిగో.. ఈ చిత్రమే దీనికి స'జీవ' సాక్ష్యం.

కడప నగరంలోని రామాంజనేయపురం వద్ద ఓ చెత్తకుప్పలో ప్లాస్టిక్ సామాన్లు ఏరుకుంటూ ఓ వృద్ధుడు బతుకుబాటలో సాగుతుంటే... అదే సమయంలో ఆవులు, శునకాలు ఆకలి తీర్చుకునే పనిలో నిమగ్నమయ్యాయి. అందరిదీ ఆకలి పోరే.. బతుకుదారే.. - ఫొటోలు.. మహమ్మద్ రఫీ, సీనియర్ ఫొటోగ్రాఫర్,కడప

క్లుప్తంగా

పెన్షన్ మంజూరు కోసం వచ్చి..



వృద్ధుడిని 108 ద్వారా రిమ్స్‌కు తరలిస్తున్న సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్ : వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని చాలా రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో.. కలెక్టర్‌కు తన గోడు చెప్పుకొంటే ప్రయోజనం ఉంటుందని భావించి వ్యయ ప్రయాసల కోర్చి సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చిన ఓ వృద్ధుడు ఫిట్స్ రావడంతో సభా భవనం వద్ద పడిపోయాడు. దీంతో పీజీఆర్‌ఎస్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో వాహనం అక్కడికి చేరుకోవడంతో వృద్ధుడిని వెంటనే ఎక్కించి రిమ్స్‌కు తరలించారు. పోరుమామిళ్ల మండలం రామనపల్లె గ్రామానికి చెందిన ఆ వృద్ధుడి పేరు రామయ్యగా తెలిసింది.

పరికరాల అమరికలో జాగ్రత్తలు తీసుకోవాలి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల పొలాలకు అమర్చే బిందు, తుంపర సేద్య పరికరాల అమరికలో ఇంజినీర్లు, ఎఫ్‌సీఓలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం(ఏపీ ఎంఐపీ) ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని ఏపీ ఎంఐపీ పీడీ కార్యాలయంలో జిల్లా ఎంఐ కంపెనీ ఇంజినీర్లు, ఎఫ్‌సీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–15 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 29,300 హెక్టార్లకు సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరం ఉన్న ప్రతి రైతు తమ పరిధిలోని ఆర్‌ఎస్‌కేలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ ఎంఐ ఇంజినీర్లు, ఎంఐడీసీలతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలకు చిరునామా డీఈఓ

- అనతి కాలంలోనే ఆరోపణల వెల్లువ
- డీఈఓ తీరును వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయులు
- ఆ అధికారి మాకొద్దంటూ సంఘాల ధర్నా
- విచారణ జరిపించాలని పట్టు



డీఈఓకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు



జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఐక్య ఉపాధ్యాయ సంఘ నేతలు

టాస్క్‌ఫోర్స్ : ఆమె లక్షలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు, జిల్లా మొత్తం విద్యాశాఖకే ఉన్నతాధికారి. అందరికీ ఆదర్శంగా ఉంటూ విద్యార్థుల అభ్యుదయానికి బాటలు వేయాల్సి ఉంది. అలాంటి ఉన్నతాధికారి బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే.. వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. పలు రకాల ఆరోపణలు మూటగట్టుకున్నారు. అటు విద్యార్థి సంఘాలతోపాటు ఇటు ఉపాధ్యాయుల సంఘాలు సైతం డీఈఓ మీనాక్షి తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చివరికి ఈ డీఈఓ మాకొద్దంటూ ఒకటి రెండు ఉపాధ్యాయ సంఘాలు కాదు, అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకమై డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బహుశా అలాంటి ఘటన విద్యాశాఖలో ఇదే ప్రథమం కావచ్చు. డీఈఓ తీరును అటు కార్యాలయ సిబ్బంది కూడా వ్యతిరేకిస్తుండటం గమనార్హం. ఆమె పాఠశాలలకు తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పట్ల ఆమె వ్యవహారశైలి పలు వివాదాలకు తెరలేపుతోంది. దీంతో ఆమె తీరును వారు సైతం తూర్పార పడుతున్నారు. అంతేకాకుండా సమగ్రశిక్షలో పని చేస్తున్న ఓ సెక్టోరియల్ అధికారి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి కూడా డీఈఓ కారణమనే ఆరోపణలు వచ్చాయి. ఏదిఏమైనా డీఈఓ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టైపిస్టు నుంచి ఎఫ్‌ఏసీ డీఈఓగా..

ఈమె ఉద్యోగ ప్రస్థానం టైపిస్టుగా ప్రారంభమైంది. తరువాత పలు పదోన్నతులతో చివరకు ఎఫ్‌ఏసీ డీఈఓగా మీనాక్షి కడపకు వచ్చారు. ఈమె నాన్ టీచింగ్ వైపు నుంచి రావడంతో అకడమిక్ వైపు సరైన అవగాహన లేదనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలకు తనిఖీలకు వెళ్లినప్పుడు అక్కడ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను కించపరిచేలా వ్యవహరిస్తుండటంతోపాటు గౌరవం లేకుండా సంబోధిస్తుండటం.. గంటల తరబడి వారిని నిలబెట్టి ఇబ్బందులకు గురి చేస్తోందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతోపాటు విద్యార్థుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల పట్ల కూడా సరిగా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అలాగే ఉపాధ్యాయ సంఘాలు ఉపాధ్యాయుల సమస్యలపైన కార్యాలయానికి వస్తే.. సరైన మర్యాద ఇవ్వకపోవడంతోపాటు ఫోన్లు సైతం లిఫ్ట్ చేయడం లేదని పలువురు సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. అన్ని రకాల సమస్యలతో విసుగెత్తిన సంఘాలు చివరకు సంబంధిత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు కూడా ఆమెను మందలించి సర్దుకోవాలని చెప్పారని.. అయినా మార్పు రాలేదని తెలిసింది. చివరకు ఉపాధ్యాయ సంఘాలు అల్టిమేట్‌గా డీఈఓకు వ్యతిరేకంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులంతా కలిసి 'ఈ డీఈఓ మాకొద్దంటూ' నినాదాలతో ధర్నా చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈమె తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

తదుపరి కార్యాచరణ సిద్ధం

డీఈఓ తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక మరో కార్యాచరణకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. మరో రెండు మూడు రోజుల్లో కార్యాచరణను ఆరంభిస్తున్నట్లు సమాచారం. మొదటగా నల్లబ్యాడ్జీలతో నిరసన, ఆ తరువాత డీఈఓ కార్యాలయం ముట్టడి, అనంతరం నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిసింది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష సైతం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అలాగే విద్యార్థి సంఘాలు సైతం డీఈఓను పదవి నుంచి తొలగించాలంటూ నినదిస్తూ, ఉపాధ్యాయుల ఉద్యమానికి మద్దతుగా నిలుస్తుండటం గమనార్హం.

ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యం



ఉపాధ్యాయులను నిరంతరం ఏదో ఒక రకంగా వేధించడమే డీఈఓ లక్ష్యం. ఆమె ఉపాధ్యాయులను బానిసల్లాగా చూస్తోంది. ఉపాధ్యాయులను విద్యార్థుల ముందే నిందించడం, అసభ్యకరమైన పదజాలంతో దూషించడం పరిపాటిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్‌ను పూర్తి చేయడంలో జిల్లా 5వ స్థానంలో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 829 మంది ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేసి చరిత్రకెక్కారు. సమగ్ర శిక్షలో చిరు ఉద్యోగుల జీతాలను నిలిపివేశారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తున్నారు. తక్షణం ఆమెను డీఈఓగా తప్పించకపోతే పోరాటాన్ని తీవ్రతరం చేస్తాం.

– మాదన విజయకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



ఉపాధ్యాయుల పట్ల డీఈఓ సున్నితంగా వ్యవహరించకుండా కఠిన వైఖరి ప్రదర్శించడం సరికాదు. అందరూ అంకిత భావంతో పని చేసే వారే. ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు బోధనలో కొంతమేర తప్పు జరిగివుంటే సున్నితంగా సరిదిద్దాలి. అంతే గానీ ఉపాధ్యాయుల ఆత్మ గౌరవం దెబ్బతినేలా ప్రవర్తించడం డీఈఓకు భావ్యం కాదు. టీచర్లను వ్యక్తిగతంగా బాధపెట్టే విధంగా మాట్లాడటం, వ్యక్తి రూపాన్ని బట్టి తిట్టడం, అసభ్య పదజాలంతో ప్రధానోపాధ్యాయులను మాట్లాడటం చాలా బాధాకరం. ఇలాంటి డీఈఓ పట్ల ప్రభుత్వం వెంటనే ఆలోచించి తగు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీఎఫ్


విద్యావ్యవస్థకు పనికిరారు



జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ ఆదర్శంగా ఉండాల్సిన డీఈఓ అధికారం ఉంది కదా అనే అహంకారంతో తన మాటతీరు, వింత ప్రవర్తనతో ఉపాధ్యాయులను మానసికంగా హింసిస్తూ క్షోభకు గురి చేస్తున్నారు. ఇలాంటి అధికారి విద్యావ్యవస్థకు పనికిరారు. విద్యార్థుల ఎదుటే ఉపాధ్యాయులను కించపరుస్తూ అభ్యంతరకరమైన పదజాలంతో తిడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఉపాధ్యాయుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే ఇటువంటి అధికారి వల్ల ఉపాధ్యాయులు బోధనపై మనసు నిమగ్నం చేయలేకున్నారు. ఇది ఇలాగే కొనసాగితే విద్యార్థులకు కూడా నష్టం జరిగే అవకాశం ఉంది. ఇటువంటి మనస్తత్వం కలిగిన అధికారి విద్యావ్యవస్థకు పనికిరారు. ఈమెను వెంటనే విధుల నుంచి తప్పించాలి.

– మోపూరి వెంకట శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఆర్‌టీయూ

ఆదర్శంగా ఉండాల్సిన..



ఉపాధ్యాయులకు ఆదర్శంగా ఉండాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారే.. సహనం కోల్పోయి కింది స్థాయి సిబ్బందిని దుర్భాషలాడుతూ అవమానిస్తున్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోగా పురుగుల్లా చూస్తోంది. ఆమె తీరుకు నిరసనగా ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన 'ఆత్మగౌరవ ఉద్యమాన్ని' పాలకులు పరిగణనలోకి తీసుకుని, ఉపాధ్యాయులను అవమానిస్తున్న డీఈఓను విధుల నుంచితప్పించాలి.

– నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ

లెసెన్ ప్లాన్ అడిగినందుకే ఆరోపణలు



పాఠశాలను విజిట్ చేసినప్పుడు ప్రధానోపాధ్యాయులను లెసన్ ప్లాన్ అడిగినందుకే నాపై ఆరోపణలు చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో లెసెన్‌ప్లానే పాటించడం లేదు. నేను పాఠశాలలను విజిట్ చేసినప్పుడు అందులో ఒక కాలం ఉంటుందని, దానిని నేను ఫిల్ చేసి పంపాలన్నాను. కొన్ని పాఠశాలల్లో డిజిటల్ లెసన్‌ప్లాన్ అమలు చేస్తున్నామని చెబుతున్నారని, దానిని కూడా చూపడం లేదన్నారు. అప్పటికీ నేను మళ్లీ విజిట్‌కు వచ్చినప్పుడు చూపాలని చెప్పి వస్తున్నాను తప్ప ఎవరినీ వేధించలేదు. ఎవరిపైన ఉమ్మివేయలేదు. అది నాకు తెలియని కూడా తెలియదు. నేను ఒక గురువు దగ్గర విద్యనేర్చుకుని వచ్చిన దాన్నే. గురువులంటే నాకు ఎనలేని గౌరవం. మా ఇంట్లో కూడా ఇద్దరు గురువులు ఉన్నారని, నేను అలా చేయలేను. ఇలాంటి ఆరోపణలైతే చాలా బాధగా ఉంది. నాకు మనుషులను చంపేంత క్రూరత్వం లేదు. నాపై వచ్చే ఆరోపణలన్నీ అవాస్తవాలే. ఆర్‌జేడీ నన్ను పది రోజులు పాఠశాల విజిట్‌కు వెళ్లవద్దని చెప్పారు. అందుకే విజిట్‌కు వెళ్లడం లేదు.

– మీనాక్షి, డీఈఓ, వైఎస్సార్ జిల్లా

ముగిసిన మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

- రాష్ట్రస్థాయికి 25 మంది క్రీడాకారుల ఎంపిక
- విజేతలకు ట్రోఫీల బహూకరణ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు, ట్రోఫీలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసు పెరిగేకొద్దీ ఆరోగ్యంగా ఉండేందుకు ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకుని ఆడాలని సూచించారు. జిల్లాలో ఓ వయసు దాటిన తర్వాత ఎక్కువ మంది బ్యాడ్మింటన్ క్రీడ ఆడుతుండటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. టోర్నమెంట్ రెఫరీ, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్ ఎస్.జిలానీబాషా మాట్లాడుతూ చాలా మంది క్రీడాకారులు యువ క్రీడాకారులకు దీటుగా చక్కటి ప్రదర్శనతో రాణించారన్నారు. అదే స్ఫూర్తిని రాష్ట్రస్థాయి పోటీల్లో కనబరచాలని సూచించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరిలో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, డీఎస్‌ఏ కోచ్ సుదర్శన్, అఫిషియల్స్ మనోహర్‌బాబు, చంద్రబాబురెడ్డి, సోనీశామ్యూల్, మహేష్, షామీర్, జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

35 ప్లస్ విభాగం : ఎస్.షరీఫ్–ఎం.హరికిశోర్, టి.సూర్యమోహన్– జె.లోకేష్

మిక్స్‌డ్ డబుల్స్ : ఎ.మధుసూధన్‌రెడ్డి–ఎ.దేవి.

40 ప్లస్ విభాగం : జి.సురేష్–డి.వి.సుబ్రమణ్యం, పి.బాలాజీ–ఆర్.రామకృష్ణ

45 ప్లస్ విభాగం : బి.సుదర్శన్, ఎస్.నరేంద్రబాబు, బి.రమేష్

50 ప్లస్ విభాగం : కె.కృష్ణయ్య, వి.తులసిరామ్, వి.నాగరాజు

55 ప్లస్ విభాగం : వై.జనార్ధన్‌రెడ్డి, జి.శ్రీనివాసులు, కె.రామస్వామిరాజు

60 ప్లస్ విభాగం : కె.అబ్రహం, ఎ.కుళాయిస్వామి, ఆర్.రామచంద్రయ్య

65 ప్లస్ విభాగం : జయచంద్ర

జిల్లాకే ప్రథమం.. అన్నమాచార్య విశ్వవిద్యాలయం

- రాజంపేటలో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- 9న హర్యానా గవర్నర్‌చే ప్రారంభం

రాజంపేట(అన్నమయ్య జిల్లా) : జిల్లాకే ప్రప్రథమంగా అన్నమాచార్య విశ్వవిద్యాలయం(ఏయూ) ఏర్పాటైంది. 52 ఎకరాల్లో రాజంపేటలో ఏయూ ఏర్పాటు కావడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 9న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ అన్నమాచార్య యూనివర్సిటీని ప్రారంభించనున్నారు. సినీ హాస్యనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్‌చౌదరి, యువనటుడు కిరణ్ అబ్బవరం పాల్గొంటారు. 1997లో అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటైంది. 1998లో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఆవిర్భవించింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యను అందించాలన్న ఉద్దేశంతో విద్యావేత్త చొప్పాగంగిరెడ్డి కళాశాలను తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నమచార్య యూనివర్సిటీ మంజూరు అయింది. ఈ నెల 9న బీహార్ గవర్నరు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

అటానమస్.. న్యాక్ అక్రిడేషన్

వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ రావడం వల్ల మూడుసార్లు న్యాక్ అక్రిడేషన్, ఎన్‌బీఏ మూడుసార్లు దక్కించుకుంది. అటానమస్‌గా గుర్తింపు కడప, తిరుపతి, హైదరాబాద్‌లలో ఇంజినీరింగ్ కళాశాలల బ్రాంచీలను ఏర్పాటు చేశారు.



అన్నమాచార్య విశ్వవిద్యాలయం(ఏయూ)

ఎందరో.. మరెందరో..

రాజంపేట ఏఐటీఎస్‌లో విద్యనభ్యసించిన సినీనటుడు అబ్బవరం కిరణ్, ప్రముఖ మెజీషియన్ మైనుద్దీన్‌తో పాటు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. దేశ, విదేశాల్లో వేల సంఖ్యలో ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఏ కార్యక్రమానికి, పోటీ పరీక్షలు, ఇతరత్రా పరీక్షలకు ఏఐటీఎస్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకుంటోంది.

అరుదైన అవకాశం

రాజంపేటకు యూనివర్సిటీ మంజూరు అరుదైన అవకాశం. ఆ అవకాశాన్ని సీమ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. రాయలసీమకే తలమానికంగా నిలిచేలా ఏయూను తీసుకొస్తాం. అందరి కృషి, సహకారం మరువలేనిది. బీహార్ గవర్నరు దత్తాత్రేయ ఏయూను ప్రారంభిస్తారు.

– చొప్పా గంగిరెడ్డి, చాన్స్‌లర్, ఏయూ, రాజంపేట

ఏఐటీఎస్‌లో అట్టహాసంగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు

అన్నమాచార్య యూనవర్సిటీలో ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను అట్టహాసంగా నిర్వహించనున్నట్లు అన్నమాచార్య యూనవర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి అన్నారు. సోమవారం తన చాంబర్‌లో తన సోదరుడు, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డితో కలిసి ఆయన విలేకరలతో మాట్లాడారు. మూడు రోజుల పాటు ఏయూ క్యాంపస్‌లో ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు, అన్నమాచార్య యూనవర్సిటీ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలిరోజున మంగళవారం సాయంత్రం ఎంపీ మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్‌నైదియాదేవి హాజరు అవుతారన్నారన్నారు. బుధవారం ఆరు వేల మంది విద్యార్థులతో ఐదు కిలోమీటర్ల పాటు రాజంపేటలో యాంటీ డ్రగ్స్ ర్యాలీ ఉంటుందన్నారు. మత్తు మందులకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించే అద్భుతమైన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. డ్రగ్స్ వ్యతిరేకంగా పదం కదిలిపితే, అడుగువేస్తే అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడానికి కారణమవుతందన్నారు. రాజంపేటలో ఉదయం 7.30 గంటలకు యూనవర్సిటీ ప్రాంగణం నుంచి సమూహం కదిలి జనచైతన్యం కలిగిస్తుందన్నారు. కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రారంభించనున్నారన్నారు. ఇందులో అన్నమాచార్య ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సీ.రామచంద్రారెడ్డి, ఏయూ ప్రో–చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి పాల్గొనడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ర్యాలీలో సినీనటుడు కేవీప్రదీప్ పాల్గొంటారన్నారు. పెద్ద సామాజిక ప్రయోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అదే రోజు సాయంత్రం సీమలో వివిధ విభాగాలలో రాణించిన వారికి అన్నమాచార్య యూనివర్సిటీ అవార్డు కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకు మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ జి.సతీష్‌రెడ్డిలు హాజరు కానున్నారన్నారు. మూడవ రోజున సాయంత్రం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ చౌదరి, అబ్బవరం కిరణ్‌లు హాజరు కానున్నారని వెల్లడించారు. అన్నమాచార్య యూనవర్సిటీ ఆవిర్భావం, రాజంపేట ప్రాంతంలో ఉన్నత విద్యాభివృద్ధికి నిదర్శనమన్నారు.

ప్రజాప్రతినిధులంటే అంత అలుసా?

- కమిషనర్ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం
- ఉన్నతాధికారులు, స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడి



మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఏదైనా సమస్యపై ఫోన్ చేస్తే కనీసం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మున్సిపల్ కమిషనర్‌కు తగదని, మున్సిపల్ కమిషనర్‌కు ప్రజాప్రతినిధులంటే అంత అలుసా అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని ఐలమ్మ కాలనీకి చెందిన ఓబయ్య అనే వ్యక్తి తాను పదేళ్లుగా మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తూ నివాసముంటున్న ఇంటిని కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా కూల్చివేశారని తనకు ఫిర్యాదు చేయడంతో.. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో మాట్లాడేందుకు రెండుసార్లు ఫోన్ చేయగా స్పందించలేదని, మెసేజ్ చేసినా స్పందన లేదని తెలిపారు. తిరిగి మళ్లీ ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ చేశారని తెలిపారు. ఇదే విషయమై ఇతర శాఖల అధికారులకు ఫోన్ చేస్తే తక్షణమే స్పందించి విచారణ చేస్తామని తెలిపారని, కమిషనర్ ఫోన్ ద్వారా కూడా సమాధానం చెప్పకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫోన్ చేస్తే ప్రజాప్రతినిధినన్న కనీస గౌరవం లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు దళిత ప్రజాప్రతినిధులంటే చులకనభావం ఉన్నట్లుందని, గతంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి తనకు ఆహ్వానం కూడా పంపలేదని, ఇదే సమయంలో మున్సిపాలిటీకి చెందిన 27వ వార్డు కౌన్సిలర్ శీలిరమాదేవి అనే దళిత మహిళ కుటుంబానికి చెందిన దుకాణాన్ని సైతం ఏకపక్షంగా ఇటీవల తొలగించారని అన్నారు. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే విషయంలో కమిషనర్ ఇలా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. మున్సిపల్ కమిషనర్ తీరుపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఆర్‌డీ, సీడీఎంఏ అధికారులు, అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

'టీడీపీ కార్యకర్తలా మున్సిపల్ కమిషనర్'


బద్వేలు : బద్వేలు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి టీడీపీ కార్యకర్తలా పని చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల బద్వేలు పట్టణంలో మైదుకూరు రోడ్డులో వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ చెన్నయ్య కిరాణాబంకును రోడ్డుకు అడ్డంగా ఉందని పోలీసు బందోబస్తుతో తొలగించారని తెలిపారు. పట్టణంలో నాలుగురోడ్ల కూడలి నుంచి మూడు కిలోమీటర్ల వరకు ఉన్న ప్రధాన రహదారిలో పదుల సంఖ్యలో వ్యాపార సముదాయాలు ఉన్నాయని వాటన్నింటినీ తొలగించకుండా.. చెన్నయ్య కేవలం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కావడం వలననే టీడీపీ వారి ప్రోద్బలంతో కమిషనర్ బంకును తొలగించారని తెలిపారు. టీడీపీ వారివి రోడ్డుకు అడ్డంగా ఉన్నా.. వాటి జోలికి కమిషనర్ పోలేదని, ఆయన అధికారిగా పని చేస్తున్నాడా, టీడీపీ కార్యకర్తగా పని చేస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. ఇలా కక్షసాధింపు చర్యలకు పాల్పడితే కమిషనర్ తీవ్రపరిణామాలు ఎదర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా ఇంత వరకూ మున్సిపల్ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐదేళ్లలో మున్సిపాలిటీ అభివృద్ధికి దాదాపు రూ.90 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ గోపవరం ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బిజవేముల రామసుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.రమేష్, నాయకులు శ్రీరాములు, చెన్నక్రిష్టారెడ్డి, వెంకటసుబ్బయ్య, రఘురామిరెడ్డి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్‌సీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వి.రాజగోపాల్‌రెడ్డి

ప్రొటోకాల్ పాటించని అధికారులు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలకు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న జాబ్ మేళానా, లేక తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాబ్ మేళానా అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన ప్రజాప్రతినిధులైన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఫొటోలు లేకుండా ఇటీవల జాబ్‌మేళా ఎలా నిర్వహించారన్నారు. ఈ జాబ్‌మేళాకు వార్డ్ కౌన్సిలర్, మునిసిపల్ చైర్మన్‌ను కూడా ఆహ్వానించకపోవడం దేనికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామా లేక, నియంతృత్వంలో ఉన్నామా అని ప్రశ్నించారు. గతంలో ప్రతి ప్రారంభోత్సవ శిలా ఫలకంపైన ప్రొటోకాల్ పాటించామని, అలా పాటించాలని సాక్షాత్తూ ఎంపీ అవినాష్‌రెడ్డే అధికారులకు చెప్పేవారన్నారు. కనీసం ప్రొటోకాల్ పాటించని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వారు పట్టించుకోకపోతే కోర్టులకు వెళ్లి తేల్చుకుంటామన్నారు.



మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా

టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్



అటవీ సిబ్బందికి సూచనలిస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

బద్వేలు అర్బన్ : ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఫారెస్టు కాంప్లెక్స్‌లో వివిధ రేంజ్‌ల ఎఫ్‌ఆర్‌ఓలు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎర్రచందనం పరిరక్షణకు అటవీ ప్రాంత సమీపంలోని ప్రజల సహకారం తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎర్రచందనం స్మగ్లర్లు ప్రవేశిస్తున్న మార్గాలు, లోడింగ్, అన్‌లోడింగ్ పాయింట్లను గుర్తించి బేస్‌క్యాంపులు పటిష్టం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎర్రచందనం స్మగ్లింగ్ ప్రభావిత గ్రామాల్లో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని కోరారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేరానికి పదే పదే పాల్పడే వ్యక్తులపై పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే గతంలో ఎర్రచందనం కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై నిఘా ఉంచాలని సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా ఎదురయ్యే సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అటవీ చెక్‌పోస్టులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బద్వేలు, పోరుమామిళ్ల, వనిపెంట ఎఫ్‌ఆర్‌ఓలు నయీమ్‌అలీ, రఘునాథరెడ్డి, ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.